ప్రజాశక్తి

గురువారం 11 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నిబద్ధతతో పనిచేయండి

- పంచాయతీల రెవెన్యూ పెంపుపై దృష్టి పెట్టండి
- స్థాయీ సంఘాల సమావేశాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- పింఛన్ల రద్దు, ఉద్యోగోన్నతుల్లో అక్రమాలపై ప్రశ్నించిన సభ్యులు



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వోద్యుగులు సమస్యలపై నిబద్ధతతో పనిచేయాలని, పంచాయతీలలో రెవెన్యూను పెంచే యోచన చేయాలని విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో 1 నుండి 7 వరకు స్థాయీ సంఘ సమావేశాలు బుధవారం జరిగాయి. తొలుత అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని పంచాయతీ రాజ్ అధికారుల పనితీరుపై జెడ్‌పిటిసి సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీలలో రెవెన్యూను పెంచే యోచన చేయాలని అధికారులను కోరారు. వికలాంగుల పింఛన్లు రద్దు చేయొద్దని కోరారు. మునగపాక జెడ్‌పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ అనకాపల్లి ఆర్ఇసిఎస్‌లో ప్రమోషన్లలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సంస్థలో అర్హత లేని, సర్టిఫికెట్లు లేని వ్యక్తులు, తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. తప్పుడు ప్రమోషన్ల ఆధారంగా తీసుకున్న జీతాలను రికవరీ చేయాలని కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ లే అవుట్లతో పంచాయతీ ఆదాయం కోల్పోతుందని, ప్లాట్లు కొనుగోలుదారులు నష్టపోతున్నారని చెప్పారు. అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ మిగతా 2లో..



గిరిజన సమస్యలపై ప్రశ్నిస్తున్న సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు



సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీకి స్వాగతం పలుకుతున్న జగ్గునాయుడు తదితరులు

ఎం.ఎ.బేబీకి ఘన స్వాగతం

ప్రజాశక్తి - విశాఖపట్నం

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ బుధవారం రాత్రి విమానంలో విశాఖకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు వద్ద ఆయనకు ఘన స్వాగతం లభించింది. పార్టీ శ్రేణులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అపూర్వ స్వాగతం పలికాయి. బేబీకి ఘన స్వాగతం పలికిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, మణి, జగన్, కుమార మంగళం, పి.వెంకటరెడ్డి, ఉరుకూటి రాజు, పైడిరాజు, విమల, ప్రభావతి, అజయ్, కౌషిక్, జి.రమణ, లీలావతి తదితరులు ఉన్నారు. విశాఖలోని పిఠాపురం కాలనీ, కళాభారతి రోడ్డులో నిర్మించిన సీతారాం ఏచూరి భవన్ (సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయం)ను గురువారం ఉదయం 9 గంటలకు బేబీ ప్రారంభించి మాట్లాడనున్నారు. సాయంత్రం 5 గంటలకు పాత గాజువాక జంక్షన్‌లో జరిగే ఉక్కు పరిరక్షణ సభలోనూ ఆయన ప్రసంగిస్తారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

వార్త 4లో..

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

వార్త 2లో..

వైద్య విద్య ప్రైవేటీకరణ వద్దు

వార్త 3లో..

నేపాల్‌లో చిక్కుకున్న విశాఖ వాసులు

నేడు ప్రత్యేక విమానంలో వచ్చే అవకాశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేపాల్‌లో విశాఖకు చెందిన పది మంది ఎల్ఐసి ఉద్యోగులు చిక్కుకున్నారు. వారం రోజుల క్రితం పర్యటన నిమిత్తం అక్కడకు వెళ్లిన వీరంతా ప్రస్తుతం క్షేమంగానే ఉన్నట్టు సహోద్యోగులు చెబుతున్నారు. నేపాల్‌లో విశాఖకు చెందిన వారు చిక్కుకున్న విషయాన్ని జిల్లా అధికార యంత్రాంగం ధ్రువీకరించలేదు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు తప్పితే తమకు ఏ సమాచారమూ అందలేదని వారు తెలిపారు. ఇదిలా ఉండగా గురువారం మధ్యాహ్నానికి ప్రత్యేక విమానంలో నేపాల్‌లో చిక్కుకున్న వారంతా విశాఖకు రానున్నట్టు సమాచారం. 3.30 గంటలకు ఇండిగో ప్రత్యేక విమానంలో ఖాట్మాండ్ నుంచి వారు రానున్నట్టు తెలుస్తోంది.

బాణసంచా అక్రమ నిల్వలపై దాడులు

రూ.2.66 లక్షల విలువైన సామగ్రి సీజ్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : నగరంలో ఒకటి, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ల పరిధిలో బాణసంచా అమ్మకాలపై సిటీ టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దాడులలో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ కురుపాం మార్కెట్ సమీపంలోని పి.వరప్రసాద్ వద్ద రూ. 2.06 లక్షలు, అదే ప్రాంతంలో బండారు అప్పలరాజు వద్ద రూ. 50 వేల విలువైన బాణసంచా సామాగ్రిని సీజ్ చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బొట్ట భవాని శంకర్ అనే వ్యక్తి వద్ద రూ. 10 వేలు విలువచేసే బాణసంచా సీజ్ చేసి, ఆయా పోలీస్ స్టేషన్లకు అప్పగించారు.

ప్రజారోగ్యంపై ఫోకస్

- నగరంలో అపరిశుభ్ర ఆహారం అమ్మకాలపై 'షీ' టీమ్స్
- 302 తనిఖీలు ◆ 173 హోటళ్లకు జరిమానాలు
- పట్టణ ప్రణాళిక విభాగం ప్రక్షాళనపై సర్వే
- 98 వార్డుల్లో 112 రోడ్లను విస్తరించే ప్రణాళిక
- మీడియాతో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్



మాట్లాడుతున్న కేతన్‌గార్గ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలోని ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించామని, ఫుడ్ స్టాల్స్, హోటల్స్, రెస్టారెంట్లలో వంటకాలు తయారవుతున్న తీరును 16 శానిటేషన్ హెల్త్ ఎన్విరాన్‌మెంట్ (ఎస్‌హెచ్‌ఇ-షీ) టీమ్స్ ద్వారా గడిచిన నెల రోజుల్లో 302 తనిఖీలు చేపట్టామని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు. బుధవారం ఉదయం తన ఛాంబర్‌లో మీడియా ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ఫుడ్ ఐటెమ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న విషయంపై దృష్టిసారించినట్లు వివరించారు. ఇలాంటి ఆహార పదార్థాలు తింటే కేన్సర్ వంటి రోగాలు వస్తాయన్నారు. 173 హోటళ్లలో తనిఖీలు చేపట్టి రూ.2.71 లక్షల పైచిలుకు పెనాల్టీలు విధించామన్నారు. మొత్తం జనాభాలో 35 శాతం ప్రజలకు ఆరోగ్య రక్షణ లేకుండా పోతుందన్న అధ్యయనాలను ఆయన ఉటంకించారు. ఆహారంలో నాణ్యతపై పలు హోటళ్ల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను లేబొరేటరీలో పరీక్షలకు పంపించామన్నారు.

టౌన్ ప్లానింగ్‌లో అనుమతులకు ఆన్‌లైన్

పట్టణ ప్రణాళిక శాఖ ద్వారా ఎలాంటి అనుమతులనైనా భవిష్యత్‌లో ఆన్‌లైన్ దరఖాస్తుల ద్వారానే పొందాలన్నారు. ఈ అంశంపై సర్వే కూడా పూర్తిచేశామన్నారు. ప్రభుత్వ భూముల వివరాలు సర్వే నెంబర్లు ఉల్లంఘనలన్నిటిపైనా చర్యలుంటాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేస్తే నోటీసులు ఇచ్చి ఆపేస్తామన్నారు. నగరంలో ఆగస్టు 31 నాటికి 1480 ఓపెన్ స్థలాలున్నట్లు గుర్తించామని, 385 స్థలాల్లో పార్కులున్నాయని అన్నారు. 1100 స్థలాలకు పెన్సింగ్ వేయాల్సి ఉందన్నారు. ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ చర్యలకు వెనకాడమన్నారు. వార్డుల్లో రోడ్ల విస్తరణ కోసం చర్యలు తీసుకున్నామని, 98 వార్డుల్లో 112 రోడ్లను విస్తరణ చేసేందుకు ప్లాన్ చేశామన్నారు. 2025-26 సంవత్సరానికిగానూ రోడ్లకు రూ.250 కోట్లు మంజూరయ్యాయన్నారు. సిసి, బిటి రోడ్లను జివిఎంసి పరిధిలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నిబద్ధతతో పనిచేయండి

పూర్తి స్థాయి కేన్సర్ ట్రీట్మెంట్, గుండెకు సంబంధించిన ఆపరేషన్లు కెజిహెచ్‌లో జరుగుతున్నాయని, వెంటిలేటర్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ప్రజాప్రతినిధులు, మూడు జిల్లాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద కొన్ని ఆసుపత్రులలో మూడు వేలకుపైగా ప్రొసీజర్లను చేయించుకోవచ్చని, సభ్యులకు వాటి జాబితా పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మూడు జిల్లాల అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, జిల్లా పరిషత్ విశాఖపట్నం ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

గిరిజన సమస్యలపై గళమెత్తిన గంగరాజు

అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు భోజనం సరిగా పెట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో టీచర్ల కొరత ఉందని, వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పూర్తి స్థాయిలో నియమిస్తామని హామీ ఇచ్చారు.

ప్రజారోగ్యంపై ఫోకస్

వేస్తామన్నారు. నగరంలో 41 డ్రెయిన్‌లు సముద్రంలోకి వెళ్లేలాగ చర్యలు తీసుకున్నామన్నారు. గాజువాక, పాతనగరం, భీమిలి వరకూ ఈ వ్యవస్థ ఉందన్నారు. అప్పుఘర్ నుంచి భీమిలి వరకూ 13 డ్రెయిన్‌లను కవర్ చేసేలాగ 3 స్యూయేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టిపి)ల వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. అప్పుఘర్, సాగర్‌నగర్, భీమిలి గోస్తనీ వద్ద ఒక్కొక్కటి ఉన్నాయన్నారు. అలాగే ఈ ప్రాంతంలో నాలుగు పంప్ హౌస్‌లు ఉన్నాయన్నారు. 41 డ్రెయిన్లలో 10 డ్రెయిన్లే మిగిలాయని వీటికి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ నుంచి నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) 2026 ఫిబ్రవరిలో ఉండబోతుందని, పార్టనర్ షిప్ సదస్సులు జరగనున్నాయని, నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా 225 ఎంఎల్‌డి ఈ వేస్ట్ నుంచి వాటర్‌ను తీస్తామని అన్నారు.

నగరంలో 16 జంక్షన్లు ఇంకా ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదని, వీటిని త్వరలో అభివృద్ధి చేస్తామని అన్నారు. అలాగే ఆటోమేటిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టం (ఎటిసి) త్వరలో రాబోతుందన్నారు. నగర పరిధిలో టిడిఆర్‌లపై వివాదం రేగుతోందన్నారు. ఇప్పటివరకూ 450 టిడిఆర్‌లను పెండింగ్‌లో పెట్టామన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని టిడిఆర్‌లు కోరితే రూల్స్ ప్రకారం నిలిపివేస్తామన్నారు. వార్డులో ఒక స్ట్రీట్ వెండార్ పాయింట్‌ను ఏర్పాటు చేశామని ఇప్పటివరకూ 76 వెండార్ జోన్‌లు పెట్టామని అన్నారు.

ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు అప్పే...

ఇటీవల రూ.498 కోట్ల ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (వరల్డ్ బ్యాంక్) నుంచి వచ్చిన నిధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్యారెంటీ ఏమీ లేదని పూర్తిగా జివిఎంసి ఆర్థిక సామర్థ్యం బట్టే పై నిధులు వస్తున్నాయని కమిషనర్ వెల్లడించారు. మూడేళ్ల తర్వాత 7.1 శాతం వడ్డీ దీనిపై పడబోతుందన్నారు. నగర ప్రజలకు 2047 సంవత్సరం నాటికి నీటి వనరులు సరిపడేలాగ చర్యలు ప్రారంభించామన్నారు. దేశంలో ఏ నగర పాలక సంస్థకు ఐఎఫ్‌సి నిధులివ్వలేదన్నారు. జివిఎంసి క్రెడిట్ రేటింగ్ ఎ మైనస్‌లో ఉందన్నారు. తర్వాత ఈ అప్పును జివిఎంసియే చెల్లించుకోవాలన్నారు. పరిశ్రమలకు నీటిని జివిఎంసి అమ్ముతుందన్నారు. కిలో లీటరుకు రూ.90 పైసలు పరిశ్రమల నుంచి వస్తుందన్నారు. గతంలో టాటా సంస్థ గాజువాక తదితర చోట్ల వారు తీసుకున్న పైప్‌లైన్‌ల కాంట్రాక్టు సరిగా జరగలేదన్నారు. నీటి కనెక్షన్స్ పూర్తిస్థాయిలో ఇవ్వలేదన్నారు. విశాఖ నగరంలో 400 ఎంఎల్‌డి నీరు పరిశ్రమలకు అవసరం ఉందని, నేవీకి రోజుకు 80 ఎంఎల్‌డి అవసరమని అన్నారు. జివిఎంసి నీటి వల్లనే రూ.నిధులు సమకూర్చుకుంటుందన్నారు.

'బ్లూమ్‌బర్గ్ మేయర్స్ ఛాలెంజ్'లో జివిఎంసి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బ్లూమ్‌బర్గ్ మేయర్స్ ఛాలెంజ్ 2025లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 50 ఫైనలిస్ట్ నగరాలలో గ్రేటర్ విశాఖ ఒకటిగా నిలిచిందని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. బుధవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, 99 దేశాల నుండి 600 కంటే ఎక్కువ నగరాల మధ్య, పోటీలో బ్లూమ్‌బర్గ్ మేయర్స్ చాలెంజ్ 2025 ఫైనలిస్ట్‌గా విశాఖ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఇది ప్రజా కేంద్రీకృత, వినూత్నమైన పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో జివిఎంసి కట్టుబాటును ప్రతిబింబిస్తుందన్నారు. సమావేశంలో జీవీఎంసీ ఎస్ ఆర్ యు ప్రతినిధి స్వప్న, వి-పుల్ ప్రాజెక్ట్ మేనేజర్ ఇమ్మాన్యుయేల్, జూనియర్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ ఆఫీసర్ జాహ్నవి పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

ః **ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ** : విశాఖ నగరంతోపాటు జిల్లాలో బుధవారం విస్తారంగా వర్షాలు కురిసాయి. జిల్లాలో 14.9 మిల్లీమీటర్ల సగటుతో మొత్తం 164.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా మహారాణిపేట 51.2 మి.మీ, అత్యల్పంగా పెందుర్తి 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది. సీతమ్మధారలో 48.8 మి.మీ విశాఖపట్నం రూరల్ 30.8 మి.మీ, పెదగంట్యాడ లో 12.2 మి.మీ, ములగాడలో 10.2 మి.మీ, గోపాలపట్నంలో 4.2 మి.మీ గాజువాకలో 4.0 మి.మీ ఆనందపురంలో 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

డిజిటల్ మార్కెటింగ్, కృత్రిమ మేధపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సమత కళాశాలలో డిజిటల్ మార్కెటింగ్, కృత్రిమ మేధపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అస్యూర్డ్ అసిస్ట్ ఫౌండర్ గౌతమ్ ఆదిత్యన్ మాట్లాడుతూ వివిధ బ్రాండ్‌ల ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన, వాటిని వినియోగదారుల దరికి చేర్చి అమ్మకాలను పెంచేందుకు డిజిటల్ మార్కెటింగ్ వ్యవస్థ దోహదపడుతుందన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో చింతా మోహన్ తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దీనిని రక్షించుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. బుధవారం సాయంత్రం సరస్వతీ పార్కు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర విశాఖకు చేరుకుందని అన్నారు. దళితుల హక్కులను కాపాడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. రాష్ట్ర విభజనలాగే దేశ విభజన కూడా జరిగే ప్రమాదం ఉందన్నారు. దేశ సమైక్యత, సమగ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్‌సి వర్గీకరణను వెనక్కి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అశోక్ బాబు, దాసరి చెన్న కేశవులు, డాక్టర్ రాజేంద్ర, బిఆర్‌కె.అంబేద్కర్, సూర్యారావు, ప్రకాష్, శరత్ బాబు, ఎం.నాగమల్లీశ్వరి, గుంజా చింతయ్య, చిన్నారావు పాల్గొన్నారు.

ఎన్‌డిఎ నుంచి బయటకు రావాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ, ఆంధ్రుల ఆత్మగౌరవం, స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధనకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నుంచి ఎపి సిఎం చంద్రబాబు వైదొలగాలని చింతా మోహన్ అన్నారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ డిసెంబర్ 31 లోపు, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయబోమని కేంద్ర కేబినెట్ ఆమోదించకుంటే ఎన్‌డిఎకు టిడిపి మద్దతు ఉపసంహరించుకోవాలన్నారు. లిక్కర్ కుంభకోణంలో ఇరుకున్న జగన్ ఇపుడు ఆకుపచ్చ కండువా వేసి రైతుపోరు పేరుతో సిఎం కావాలని తపన పడుతున్నాడని, అది ఏనాటికీ సాధ్యం కాదని జోస్యం చెప్పారు. అమెరికాలో ట్రంప్‌కు పట్టిన గతే, ప్రధాని మోడీకి ఎందుకు పట్టదో అంతుపట్టడం లేదని, అయితే వీరిద్దరి మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందని అన్నారు. రుణ మాఫీలో లక్ష కోట్లు అవినీతిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించాలన్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ వద్దు



నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయవద్దనిఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కెవిపి చంద్రమౌళి అన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయటం వల్ల రాబోయే కాలంలో వైద్యం పేదలకు అందని గగనకుసుమంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పిపిపి, ఆరోగ్యశ్రీ స్థానంలో ఇన్సూరెన్స్ తీసుకువచ్చే చర్యను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పివి. సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన నిరసనలో చంద్రమౌళి మాట్లాడుతూ, ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత అని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు.ఆరోగ్యంగా జీవించే హక్కును హరిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వర్మ, శ్రీనివాస్, రామారావు, సన్యాసిరావు, జగన్, అప్పన్న, కళాధర్ పాల్గొన్నారు.

పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని ఎవిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు హితవు పలికారు. బుధవారం జెసిఐ వారోత్సవాల్లో భాగంగా ఎవిఎన్ కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి బిపి, షుగర్, ఇసిజి, దంత, కంటి వైద్య పరీక్షలతో పాటు స్త్రీల వైద్య నిపుణులు వైద్య సలహాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కృష్ణకుమారి,జెసిఐ వైజాగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్ చరిష్మా, పాస్ట్ జోన్ వైస్ ప్రెసిడెంట్ బి.ప్రభాకర్, కోఆర్డినేటర్ కె.ఎం.కె. రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వి డెంటల్ హాస్పిటల్, వి హెల్త్ కేర్, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు వైద్య సేవలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ ఎన్.గౌతమి, వి డెంటల్ హాస్పిటల్ కార్పొరేట్ మేనేజర్ కె.పృథ్వీరాజ్, కె. తులసి, ప్రమీల, లతీశ పాల్గొన్నారు.

'డయల్ యువర్ ఆర్‌ఎం' కు స్పందన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్ ఆర్‌టిసి విశాఖపట్నం రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమానికి స్పందన వచ్చింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో 18 కాల్స్‌రాగా, పలువురు ఆర్‌టిసి సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వీటిని మెరుగుపరించేందుకు కాకినాడ, రాజమండ్రి పాస్ట్ సర్వీసులు నడపాలని, అలాగే స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ప్రయోజనకరంగా ఉండేందుకు విశాఖపట్నం నుండి రాజమండ్రి, కాకినాడకు ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని కోరారు. రాత్రి వేళలో సిటీ బస్సులలో అదనపు ట్రిప్పులు నడపాలని కోరారు. ద్వారకా బస్ స్టేషన్, రామా టాకీస్ వరకు రోడ్డుపై ప్రైవేట్ బస్సులు నిలుపుదలతో ట్రాఫిక్ కష్టాలపై ఆర్‌టిసి, ఆర్‌టిఎ, పోలీసుశాఖలు సమన్వయంతో అరికట్టడంపై పలువురు ధన్యవాదాలు తెలిపారు. దీనిపై ఆర్‌ఎం స్పందిస్తూ, ప్రయాణీకులు ఇచ్చిన సూచనలు, సలహాలు పరిగణనలోనికి తీసుకుంటూ, తగు చర్యలు చేపడతామన్నారు.

ప్రజల మనిషి వీరభద్రరావు

సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు



సంతాప సభలో మాట్లాడుతున్న ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం నాయకులు వై.వీరభద్రరావు ప్రజల మనిషి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన వీరభద్రరావు సంతాప సభను తోకాడ గ్రామంలో బుధవారం నిర్వహించారు. వీరభద్రరావు పార్థివ దేహంపై పార్టీ జెండాను జగ్గునాయుడు ఉంచారు. అనంతరం జగ్గునాయుడు మాట్లాడుతూ, మానవ జీవితాన్ని సార్థకం చేసిన వ్యక్తి వీరభద్రరావు అన్నారు. ప్రజలు, కార్మికుల సమస్యలపై నిత్యమూ పనిచేశారని గుర్తుచేశారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం చివరి వరకు పనిచేశారన్నారు. ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులు రమేష్, రాజేష్, కమల, అరుణ కూడా సిపిఎంలో పనిచేసేలా చేశారన్నారు. బతికున్నంత కాలం పదిమందికి ఉపయోగపడడమే కాకుండా, చనిపోయిన తర్వాత కూడా ఉపయోగపడాలనే ఉద్దేశంతో వీరభద్రరావు పార్థివదేహాన్ని కెజిహెచ్‌కు దేహదానం చేశారని తెలిపారు. దేహదానానికి కుటుంబ సభ్యులు కూడా అంగీకరించడాన్ని అభినందించారు. వైద్య విద్యార్థులు ప్రయోగాల కోసం ఉపయోగపడుతుందని తెలిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

రైతు సంఘం నాయకులు నాయన బాబు మాట్లాడుతూ, వీరభద్రరావు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అన్నారు. సిఐటియు నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ, ఆయన మరణం ఉద్యమానికి తీరని లోటు అన్నారు. అణగారిన వర్గాల కోసం పనిచేశారని తెలిపారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో సిపిఎం నాయకులు రెడ్డి వెంకటరావు, ఎన్.రాజేంద్రప్రసాద్, ఎ.లోకేశ్వరరావు, కె.కిరీటం, కె.సంతోషం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఎంపిడిఒకు ప్రమోషన్

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్‌కు ఉద్యోగోన్నతి లభించింది. డిడిఒగా ప్రమోషన్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌ను పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు, టిడిపి మండల అధ్యక్షులు రమణ, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ సన్మానించారు.

యుఆర్‌డిఒకు ఎంపిడిఒగా..

మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తున్న మీనా కుమారికి ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం బదిలీ చేశారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం, తాటితూరు గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. తాటితూరులో ఆత్మ ఆధ్వర్యంలో నానో యూరియాపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఎడి బి.విజయప్రసాద్ మాట్లాడుతూ, నానో యూరియా వాడకం వల్ల పంటకు కావాల్సిన పోషకాలు ఆకుల ద్వారా అందుతుందని రైతులకు వివరించారు. గుళికల రూపంలో యూరియా వేయడం ద్వారా భూసారం దెబ్బతింటుందని, ఆవిరి రూపంలో వృధా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో వరి పంట సాగును పరిశీలించారు.

హెచ్‌ఐవి, ఎయిడ్స్ పరీక్షలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో మొబైల్ ఐసిటిసి బృందం బుధవారం ఆనందపురం మండలంలోని మద్ది, బోని గ్రామాల్లో హెచ్‌ఐవి/ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా మొబైల్ ఐసిటిసి కౌన్సెలర్ అర్జున్ మాట్లాడుతూ, గర్భం దాల్చిన స్త్రీలు తొలి త్రైమాసికంలోనే హెచ్‌ఐవి, సిఫిలిస్ పరీక్షలు చేయించుకోవాలని, దీని వల్ల శిశువులను సంక్రమణ ప్రమాదం నుంచి కాపాడవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా 44 మందికి రక్తపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌టి.కిశోర్‌కుమార్, లింక్ వర్కర్ ఎం.జ్యోతి, ఎఎన్ఎం ఎస్‌కె.బాజియా, అనురాధ, కొండమ్మ, వెంకటలక్ష్మి, సన్యాసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త గౌతమి పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12, 13 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. 12వ వార్డు పరిధి పెదగదిలి కొండవాలు ప్రాంతంలో జివిఎంసి నిధులు రూ.65 లక్షలతో కాలువలు, రహదారులకు ఆయన భూమి పూజ చేశారు. 13వ వార్డు ఆరిలోవ కాలనీ, వెర్నిదుర్గానగర్, శివాజీనగర్ ప్రాంతాల్లో రూ.1.23 కోట్ల వ్యయంతో కాలువలు, రోడ్లుకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో మౌలికవసతుల కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి వర్క్స్ ఎఇ వెంకటరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, పార్లమెంటరీ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, దువ్వి తాతారావు, 13వ వార్డు టిడిపి అధ్యక్షులు పాత్రకండ ధర్మారావు, మహిళా అధ్యక్షులు మజ్జి రమణి, కార్యదర్శి యల్లమిల్లి సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ తురకపూడి బాలస్వామి, పిఐ.బాలరాజు, మాసాబత్తుల శ్రీనివాసరావు, దేవర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల కాలుష్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి -తగరపువలస : ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇటుక బట్టీల ద్వారా తాగు నీరు, గాలి కలుషితం అవుతున్నాయని ఆరోపిస్తూ మండలంలోని తాటితూరు గ్రామానికి చెందిన గోపిశెట్టి గోవిందరావు గత నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కాలుష్య నియంత్రణ మండలి విశాఖ డివిజన్ అసిస్టెంట్ ఇంజినీర్ ఐ.సూర్యకళ బుధవారం గ్రామంలోని సంబంధిత ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రైవేట్ లే-అవుట్ ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల నిర్వహణ వల్ల కాలుష్యం వెదజల్లడమే గాకుండా శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంలోని ప్రైవేట్ ఫార్మా కంపెనీ నుంచి అనేక రసాయన వ్యర్థాలు ఇక్కడకు తరలించి లైట్ వైట్ ఇటుకలు తయారు చేస్తున్నారని క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చిన ఎఇ సూర్య కళకు గోవిందరావు వివరించారు. గాలి, తాగే నీరు కలుషితం అవుతున్నాయని తెలిపారు. తమ ప్రమేయం లేకుండానే తన స్థలంలో దాదాపు 20 అడుగుల లోతున గోతులు తవ్వారని, దీంతో ఆ ప్రాంతం ఓ చెరువును తలపించేలా ఉందని వివరించారు. నిల్వ ఉన్న నీటిలో రసాయన వ్యర్థాలు కూడా కలవడంతో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని తెలిపారు. ఇందుకు కారణమైన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

గోతుల్లో చేరిన నిల్వ నీటిని సేకరించిన ఎఇ సూర్యకళ పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపిస్తామని చెప్పారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో స్థానికులు గోపిశెట్టి గోవిందరావుతో పాటు ఎం.గుర్నాయుడు, యు.చిన్నారావు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గీతం ఫార్మశీ కళాశాలకు జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ బోధన, పరిశోధనలో పాటిస్తున్న అత్యున్నత ప్రమాణాలకు గుర్తింపుగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) 2025 సంవత్సరం ర్యాంకింగ్‌ల పట్టికలో 33వ స్థానం సంపాదించిందని గీతం ఇంటర్నల్ క్వాలిటి ఎస్యూరెన్స్ సెల్, అక్రిడిటేషన్, ర్యాంకింగ్ విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ ఆర్.రాజా ప్రభు తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అధ్యాపకులను అభినందించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలకు ఇస్తున్న ప్రాధాన్యతకు గుర్తింపుగా ఈ ఏడాది ఇప్పటికే నాక్ ఎ++ గ్రేడ్‌తో పాటు క్యూ.ఎస్ ఆసియా విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌ను, ఎన్‌బిఎ ర్యాంకింగ్‌ను సాధించిందని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఏటా తన ర్యాంక్‌లను మెరుగు పరచుకుంటూ ఎదుగుతోందని, భవిష్యత్తులో దేశంలో అగ్ర స్థానంలో నిలవగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎల్.శ్రీనివాస్ మాట్లాడుతూ, గత ఏడాది 48వ స్థానంలో ఉన్న ఫార్మశీ కళాశాల ఈ ఏడాది 33వ స్థానం సాధించడం వెనక అధ్యాపకులు, పరిశోధక విద్యార్థుల సమిష్టి కృషి ఉందన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ అధ్యాపకులు పలు పరిశోధనా ప్రాజెక్టులతో పాటు తమ పరిశోధన ఫలితాలకు పేటెంట్ హక్కులను పొందడం, స్కూపస్ అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన ఫలితాలను ప్రచురించడం జాతీయ స్థాయి ర్యాంకింగ్‌ను మెరుగు పరుచుకోవడానికి కారణమన్నారు. స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రణాళికలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండలం అడ్డూరు సమీపంలో బుధవారం సాయింత్రం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. నలుగురికి తీవ్రగాయాయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గాజువాకలో నివాసముంటున్న చీడికాడ మండలం జైతవరం గ్రామానికి చెందిన వారు బుధవారం దేవరాపల్లి మండలం తెనుగుపూడి గ్రామంలో జరిగిన పెదకర్మ కార్యక్రమానికి ఆటోలో వెళ్లారు. తిరిగి ఆటోలో గాజువాక వెళుతుండగా అడ్డూరు వద్దకు వచ్చే సరికి విశాఖ నుండి పాడేరు వెళుతున్న ఆర్టీసీ బస్సు వారి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ కురచా భూషణం అక్కడికక్కడే మృతి చెందారు. కురచా శంకర్ పరిస్థితి విషమంగా ఉండగా, కురచా వరహామూర్తి, కురచా గంగునాయుడు, కురచా నాయుడు, మతల వరాహమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న చోడవరం ఎస్ఐ జోగారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సీరియస్‌గా ఉన్న శంకర్‌ను అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి, మిగిలిన నలుగురిని చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుల్లో కురచా నాయుడు విశాఖ డెయిరీలో వెటర్నరీ డాక్టర్‌గా పని చేస్తుండగా, మిగిలిన వారు ఎస్ఆర్‌ఎంటిలో పని చేస్తున్నారు.

కాలేజీ బస్సుపైకి రాయి

- గాయాలపాలైన విద్యార్థులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : కాలేజీ బస్సు పైకి ఆకతాయి రాయి విసరడంతో ఇద్దరు విద్యార్థులు గాయాలపాలయ్యారు. గోపాలపట్నం పోలీసుల కథనం ప్రకారం... నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ బస్సు విద్యార్థులు, సిబ్బందిని తీసుకొని మంగళవారం ఉదయం 8:30 గంటల సమయంలో కాలేజీకి వెళ్తోంది. ఆ సమయంలో కాలేజీ బస్సుపైకి పాత గోపాలపట్నం వద్ద ఆ గ్రామానికి చెందిన ఆకతాయి రవితేజ రాయి విసిరాడు. దీంతో బస్సులో వెనుక కూర్చున్న ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపట్నం సిఐ ఎల్ సన్యాసినాయుడు కేసు నమోదు చేశారు. ఎస్ఐ అప్పలనాయుడు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పాన్‌షాప్‌లో మద్యం అక్రమ విక్రయం

- 21 బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం తర్లవాడ గ్రామం ప్రకృతివానిపాలేనికి చెందిన గంటల సత్తిబాబు (48) తన ఇంటి వద్ద పాన్‌షాప్ నడుపుతూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ షాపుపై దాడులు చేశారు. 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సత్తిబాబుపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి, స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-రావికమతం: మండలంలోని గొంపలో బుధవారం ఆర్టీసీ బస్సును బైక్ ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, ఆర్‌టిసి డ్రైవర్ వివరాల ప్రకారం అనకాపల్లికి ఆర్టీసీ బస్సు వెళుతోంది. గొంప వద్ద బస్‌ను బైక్ ఢీకొట్టడంతో బైకిస్టు మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన బైకిస్టును స్థానికులు సమీపంలో రావికమతం హాస్పిటల్‌కి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపైన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

ప్రజాశక్తి - ఆనందపురం : మహిళలు స్వయం శక్తితో ఎదగాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థలు విశాఖ జిల్లా అధ్యక్షులు పిఆర్‌ఎస్ఎన్.నాయుడు అన్నారు. ఆనందపురం మండలంలోని చందక పరిసర గ్రామాల 45 మంది మహిళలు 45 రోజులపాటు టైలరింగ్ శిక్షణ పొందగా, వారికి సర్టిఫికెట్లు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పిఆర్‌ఎస్ఎన్.నాయుడు మాట్లాడుతూ, శిక్షణ పొందిన మహిళలు కుట్టుమిషన్ ద్వారా ఉపాధి పొందడంతో పాటు ఆసక్తి ఉన్న ఇతరులకు ఉచితంగా నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సేవాదళ్ కో-ఆర్డినేటర్ కె.ఈశ్వరి, ఆర్ఎ.నాయుడు, బి.సాయికుమార్, టివివి.సత్యనారాయణ, జి.అపర్ణ, ఎంవిఎస్ సాయికుమార్, డబ్బీరు విజయ్‌కుమార్, కోరాడ తమ్మునాయుడు, డి.శరత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎసిపి నరసింహామూర్తి

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎసిపి అన్నెపు నరసింహామూర్తి సూచించారు. బివికె కాలేజీలో మత్తుపదార్థాలు, సైబర్ క్రైమ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువును అభ్యసించాలని, తద్వారా ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని చెప్పారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మంచి పేరు తేవాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరగాలు వలలో చిక్కుకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గంజాయి, సిగరెట్లు, మద్యం, వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారక క్రైమ్ ఎస్ఐ రాజు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ పూజిత

పండ్లు, ఆకుకూరలతో ఆరోగ్యం

ప్రజాశక్తి- గాజువాక : పండ్లు, ఆకుకూరలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని పోషకాహార నిపుణులు డాక్టర్ పూజిత తెలిపారు. జివిఎంసి 70వ వార్డు పరిధి చట్టివానిపాలెం భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్లో విద్యార్థులకు, తల్లిదండ్రులకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యాధి నిరోధక శక్తి పెంచుకొనేందుకు పండ్లు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, డ్రై ఫ్రూట్స్, పాలు, పెరుగు, గుడ్లు తినాలని వివరించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం లో ఎటువంటి ఆహారం ఎంత పరిమాణం తీసుకోవాలో వివరించారు. ప్రతి రోజూ సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. పిల్లలకు ఎటువంటి ఆహారం అందించాలో తల్లిదండ్రులకు వివరించారు. స్త్రీల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుత ఆహారపు అలవాట్లు వల్ల వచ్చే వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. పాఠశాల డైరెక్టర్ పి.భాస్కరరావు మాట్లాడుతూ, ఆరోగ్యం పట్ల అందరూ ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రమాదేవి, ఉపాధ్యాయులు అనూష, హేమ, శైలజ, సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'గంధం' ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులపై తెలుగుదేశం కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు చేసిన తప్పుడు ఆరోపణలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సిఐటియు స్టీల్‌జోన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటరావు, వివి.రమణ కోరారు. ఆయన చేసిన ఆరోపణలపై బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. 5000 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే ఎక్కువ మ్యాన్ ఉందని తొలగించామని చెప్పడం సరికాదన్నారు. అలాంటప్పుడు జార్ఖండ్, ఒడిశా, చత్తీష్‌ఘడ్ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి ఎందుకు పనిలో పెడుతున్నారని ప్రశ్నించారు. ఇద్దరు పని చేసే చోట ఐదుగురు ఉన్నారని చెప్పటం శ్రీనివాసరావుకు సరికాదన్నారు. ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులు పనిచేయడం లేదని అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

నాణ్యమైన ఆహారం అవసరం

ప్రజాశక్తి -గాజువాక : విద్యార్థులు నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, ఆరోగ్య నియమాలు పాటించాలని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి సూచించారు. జాతీయ పోషణ మాసంలో భాగంగా శ్రీ అరబిందో ఐడియల్ హైస్కూల్ విద్యార్థుల ఆరోగ్యం, శ్రేయస్సుపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా సంయుక్తంగా బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలే కాకుండా, ఆంత్రోపోమెట్రిక్ (శరీర) కొలతల నుండి శారీరక పరీక్షల వరకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు, పోషకాహార నిపుణులు మాట్లాడి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో వ్యక్తిగత మార్గదర్శకత్వం అందించారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

ఐద్వా జాతీయ నాయకులు పుణ్యవతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని ఐద్వా జాతీయ నాయకులు ఎస్.పుణ్యవతి పిలుపునిచ్చారు. ఐద్వా ఉక్కునగరం కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సెక్టర్ -2లోని సిఐటియు కార్యాలయంలో 'స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ- మహిళలతో సమాలోచన' పేరుతో చర్చ నిర్వహించారు. ఐద్వా ఉక్కునగరం కమిటీ కార్యదర్శి కె.వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ చర్చలో పుణ్యవతి మాట్లాడుతూ, 2021 జనవరి 27వ తేదీ నుంచి ఇప్పటివరకు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరగకుండా పోరాటాలతోనే నిలబడుతూ వచ్చిందని తెలిపారు. ఇందులో మహిళలు కూడా ప్రధాన భూమిక పోషించారని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగంలో స్టీల్‌ప్లాంట్ ఉంటే ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా తయారు చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. వ్యవసాయ చట్టాలను మార్చాలని చూసినప్పుడే పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం కేంద్రం రూ.5వేల కోట్లు ఇస్తే ఇప్పటివరకు స్టీల్‌ప్లాంట్ తిరిగి రూ.65 వేల కోట్లు చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. శ్రామిక మహిళా సంఘం స్టీల్ కన్వీనర్ కె.సత్యవతి మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికుల 5000 మందిని తొలగించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో కె.విమల, చాముండి, ఎఎస్.ప్రభ, వి.సుమలత, డిఎల్ఎస్.వాణి, నవ్య, అంబిక, కనకదుర్గ, కె.వేణు, బి.పద్మావతి, రమ తదితరులు పాల్గొన్నారు. అన్ని ప్రాంతాల్లో సంతకాల సేకరణ చేపట్టాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.



సమాలోచన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా జాతీయ నాయకులు పుణ్యవతి

13వ పెన్షనర్ల సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -ములగాడ : విజయవాడలో ఈ నెల 13వ తేదీన జరుగు రాష్ట్ర సదస్సులో పెన్షనర్లు పాల్గొని జయప్రదం చెయ్యాలని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ పిలుపునిచ్చారు. మల్కాపురంలోని సిఐటియు ఆఫీసులో పారిశ్రామిక ప్రాంత పెన్షనర్ల ప్రాంతీయ సమావేశం బుధవారం నిర్వహించారు. సి.తమ్మారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కె.నూకరాజు, ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, గత నెల 25వ తేదీన జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగిన ధర్నాకు విచ్చేసి జయప్రదం చేసిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇపిఎస్- 95 పెన్షనర్లు అందరికీ రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని, సామాజిక పెన్షన్ రూ.4 వేలు ఇవ్వాలని కలెక్టర్‌కు, ముఖ్యమంత్రికి పంపిన వినతిలో పేర్కొన్నామని వివరించారు. రాష్ట్ర సదస్సులో మన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఎక్కువ మంది హాజరై జయప్రదం చేయాలని కోరారు. బిహెచ్ఇఎల్ హయ్యర్ పెన్షన్‌పై మధురై హైకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తున్నామని, దానిని పరిశీలించాక ప్రభుత్వం వైఖరిని గమనించి, మన తదుపరి కార్యక్రమాన్ని నిర్ణయించుకుందామని పేర్కొన్నారు. డిసెంబర్‌లో పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో ఒకరోజు ధర్నా, ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహించాలని తలపెట్టినట్లు తెలిపారు. ఢిల్లీ ధర్నా కార్యక్రమానికి కూడా సభ్యులు ఇప్పటినుండే సన్నద్ధులు కావాలన్నారు. ఈ సమావేశానికి అధిక సంఖ్యలో సభ్యులు హాజరయ్యారు.



అన్నదానం చేస్తున్న సారిపల్లి గోవింద్

7500 మందికి అన్నదానం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతంపేటలోని శ్రీ దుర్గా గణపతి ఆలయం నవరాత్రి ఉత్సవంలో భాగంగా బుధవారం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యాన సుమారు 7500 మందికి అన్నదానం చేశారు. ఏటా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ పాత గాజువాక జంక్షన్‌లో గురువారం నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ జివిఎంసి 69వ వార్డు పరిధి శ్రీహరినగర్‌లో సిపిఎం నాయకులు బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎస్.జగన్నాధరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో వివిధ విభాగాలను ప్రైవేటుకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో జి.మణి, గాంధీ, మల్లిక, గీత, దేవుడమ్మ, శరత్‌చంద్ర, పార్వతి, వెంకట్రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12, 13 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. 12వ వార్డు పరిధి పెదగదిలి కొండవాలు ప్రాంతంలో జివిఎంసి నిధులు రూ.65 లక్షలతో కాలువలు, రహదారులకు ఆయన భూమి పూజ చేశారు. 13వ వార్డు ఆరిలోవ కాలనీ, వెర్రిదుర్గానగర్, శివాజీనగర్ ప్రాంతాల్లో రూ.1.23 కోట్ల వ్యయంతో కాలువలు, రోడ్లుకు వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో మౌలికవసతుల కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి వర్క్స్ ఎఇ వెంకటరావు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, పార్లమెంటరీ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, దువ్వి తాతారావు, 13వ వార్డు టిడిపి అధ్యక్షులు పొత్రకండ ధర్మారావు, మహిళా అధ్యక్షులు మజ్జి రమణి, కార్యదర్శి యల్లమిల్లి సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ తురకపూడి బాలస్వామి, పి.బాలరాజు, మాసాబత్తుల శ్రీనివాసరావు, దేవర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

చౌకధరల దుకాణాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానికంగా ఉన్న పలు చౌకధరల దుకాణాల నిర్వహణపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆర్‌డిఓ కార్యాలయం ఎఒ సుధాకర్‌కు సిపిఐ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు.

ఆత్మహత్యలను నివారించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆత్మహత్యలపై ప్రజల్లో అవగాహన చాలా అవసరమని, వాటిని నివారించేందుకు కృషి జరగాలని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ నిహాల్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినాన్ని పురస్కరించుకొని పౌర గ్రంథాలయంలో కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ, రోజురోజుకూ పెరుగుతున్న ఆత్మహత్యల ఉదంతాలు అందరిని దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయని, వాటిని నివారించే దిశగా ఇటువంటి అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖంగా నగరంలోని విద్యా సంస్థలు ముందుకొస్తే తాము ఇటువంటి కార్యక్రమంలో భాగస్వాములవుతామని చెప్పారు. భారతీయ మానసిక వైద్య సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు, ప్రభుత్వ మానసిక వైద్యశాల విశ్రాంత పర్యవేక్షకుడు డాక్టర్ ఎన్ఎస్.రాజు మాట్లాడుతూ, లక్ష మందిలో 12 నుంచి 15 మంది ఏటా బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఇవి చాలా వరకు నివారించదగినవే అని చెప్పారు. ప్రజలలో అవగాహన పెరిగి, సత్వర నివారణ చర్యలు చేబడితే చాలా మంది ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమలో వైఫల్యాలు, భార్యాభర్తల గొడవలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, మత్తు పదార్థాల సేవించడం, మానసిక అనారోగ్యం ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని, వాటిని నివారించే దిశగా సమాజం స్నేహభావంతో మెలగాలని హితవు పలికారు. మానసిక ఆందోళన, దిగులు వంటి స్థితులకు కౌన్సెలింగ్, మందులు, ఇతర ప్రక్రియల ద్వారా నయం చేసుకోవచ్చని, అనుమానం కలిగిన వెంటనే మానసిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఒక హెల్ప్ లైన్ ద్వారా సేవలు అందిస్తోందని, అవసరం అనుకున్న వాళ్లు ఉపయోగించుకోవడం మంచిదన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ఎస్.రాజు

ప్రారంభంకాని కాజ్‌వే పునరుద్ధరణ పనులు

ఉపాధి కోల్పోతున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద తాచేరుపై కాజ్‌వే కొట్టుకుపోయి 25 రోజులు కావస్తున్నా నేటికీ పునరుద్ధరణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో వడ్డాది-చోడవరం మధ్య రవాణా వ్యవస్థ స్తంభించింది. వడ్డాది నుండి చోడవరం వైపు వెళ్లే వారు గౌరీపట్నం సింగిల్ రోడ్డులో ఆటోల్లో వెళ్లాల్సి వస్తుంది. తరుచూ ఈ రోడ్డులో ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కాజ్‌వే కొట్టుకుపోవడంతో చోడవరం నుండి పాడేరు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను కేజే పురం మీదుగా మాడుగుల వైపు మళ్లించారు. దీంతో వడ్డాది కూడలికి విశాఖపట్నం, చోడవరం నుండి ఆర్టీసీ బస్సులు రావడం లేదు. మరో వైపు నర్సీపట్నం-చోడవరం బస్సులు వడ్డాది వరకు మాత్రమే వస్తున్నాయి. చోడవరం నుండి నర్సీపట్నం వైపు వెళ్లే వారు గౌరీ పట్నం మీదుగా ఆటోల్లో వడ్డాది ఆర్చి వరకు వచ్చి అక్కడ బస్సులు ఎక్కువుతున్నారు. దీంతో వడ్డాది జంక్షన్‌కు ప్రయాణికుల రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. ఫలితంగా వడ్డాది జంక్షన్లో వ్యాపారాలు తగ్గిపోయాయి. చోడవరం రోడ్‌లో ఉండే దుకాణాలు దాదాపుగా మూతపడ్డాయి. రోజువారీ చిరు వ్యాపారాలు పూర్తి దెబ్బతిన్నాయి. కాజ్‌వే నిర్మించి రాకపోకల పునరుద్ధరిస్తేనే తమకు ఉపాధి ఉంటుందని పలువురు వాపోయారు. కాజ్‌వే పునరుద్ధరణకు రూ.17.5లక్షలు మంజూరయ్యాయని, టెండర్ ఖరారు అయితే పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్ బి జేఈ సత్యప్రసాద్ తెలిపారు. టెండర్ ఖరారు అయ్యాక వర్షాలు అనుకూలించకపోతే కాజ్‌వే నిర్మాణం మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది.



కొట్టుకుపోయిన కాజ్‌వేను పునరుద్ధరణ చేయని దృశ్యం



ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

ఐలమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి : అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో బుధవారం అనకాపల్లి కార్మిక కర్షక భవనంలో చాకలి ఐలమ్మ వర్థంతి సభ ఘనంగా నిర్వహించారు. ఐద్వా జిల్లా కోశాధికారి కెవిఎస్ సూర్యప్రభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1919 సెప్టెంబర్ 10వ తేదీన జన్మించారని ఐలమ్మ పేదల భూమి కోసం, బడుగు బలహీన వర్గాలు, రైతుల సమస్యల పరిష్కారం కోసం, దున్నేవాడిదే భూమి నినాదంతో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. పెత్తందారులపై పోరాట సమయంలో ఐలమ్మ బిడ్డలను వారు చంపేసినా ఏమాత్రం వెనక్కు తగ్గకుండా భూ పోరాటం చేసి పేదలందరికీ భూమిని పంచారని గుర్తు చేశారు. మహిళా సంఘం నిర్మాణం కోసం అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. మహిళల ఓటు హక్కు కోసం పోరాటం చేసి సాధించారని, మహిళలకు బాత్రూములు కట్టించాలని పోరాటాలు చేసి విజయాలు సాధించారని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, డి.డి.వరలక్ష్మి, నాయకులు జి నారాయణమ్మ, ఆర్.లక్ష్మీ, తుంపాల అన్నపూర్ణ, మనియాల బంగారం, నిమ్మకాయల సత్య చంద్రకళ, సంతకం అంగ, తయారీ నాగమణి, మంగ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి సార్వత్రిక విద్యాపీఠం ద్వారా దూర విద్యా విధానంలో నేరుగా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ గిడ్డి అప్పారావునాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ అపరాధ రుసుముతో ఈ నెల 15వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా ఏఐ కేంద్రాలు, కేంద్రాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల ద్వారా వెంటనే నమోదు కావాలని ఆయన కోరారు. పలు కారణాలతో విద్యకు దూరమై మరలా చదువును కొనసాగించాలనుకునే వారికి ఇదో చక్కని అవకాశమని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, కళాశాలల్లో చేరకుండా ఉండిపోయిన, చేరి మధ్యలో మానివేసిన వారు ఇప్పుడు నేరుగా ఇంటర్మీడియట్ కోర్సులో చేరవచ్చని తెలిపారు. సెలవు దినాల్లో శిక్షణ పొంది, పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావచ్చన్నారు. కోర్సుల్లో చేరిన వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, సులభతరమైన స్వీయ అభ్యసన సామాగ్రిని అభ్యాసకుల ఇంటికే నేరుగా పంపించడం జరుగుతుందని తెలిపారు. జ్ఞాన ధార యూట్యూబ్ ఛానల్, ఓపెన్ స్కూల్ వెబ్సైట్ ద్వారా సంబంధిత సబ్జెక్టుల పాఠ్యాంశాలు, పరీక్షల విధి విధానాలు, నమూనా ప్రశ్న పత్రాలు తదితర పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ రుసుము చెల్లింపులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులు, మహిళలు, ట్రాన్స్ జెండర్లు, మాజీ సైనిక ఉద్యోగులకు రాయితీ ఉందన్నారు. పూర్తి సమాచారానికి జిల్లా, మండల విద్యాశాఖల కార్యాలయాల్లో సంప్రదించవచ్చని వివరించారు.

గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-కశింకోట : గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్య పెంచాలని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజా అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. గ్రంథాలయ ఆవరణలో పరిశుభ్రతను పరిశీలించారు. స్థానిక గ్రామ పంచాయతీ వారు చెల్లించవలసిన గ్రంథాలయ పన్ను బకాయిలను వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె. జగన్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్

సుడిదోమ నివారణకు పసుపు ప్లేట్స్, పక్షి స్థావరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : వరి పంటలో సుడిదోమ ఆశిస్తే దాని నివారణకు పసుపు ప్లేట్స్, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎపి రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ శిరసపల్లి అప్పలరాజు అన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో బుధవారం రైతులు పొలాలలో సుడిదోమ నివారణ నిమిత్తం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పసుపుపల్లాలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం జరిగింది. దీనివల్ల వరి పంటకు ఎటువంటి పురుగు ఆశించకుండా ఉంటుందని, చీడపీడల నుంచి కాపాడుకోవడం జరుగుతుందని తెలిపారు. గాలిలో ఎగురుతున్న పక్షులు ఈ స్టాండ్ మీద నిలబడి పంటకు హాని చేసే పురుగులను ఏరుకొని తినడం వల్ల రైతు అధిక దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో, గురువారం మున్సిపల్ ఆఫీసు ఆవరణలో మార్కెటింగ్ స్టాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ నాగేశ్వరరావు, అప్పారావు, ఐసిఆర్‌పి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పాయకరావుపేట : ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులతో సుఖ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కందిపూడిలో వైద్య సిబ్బంది, గ్రామస్తులతో ర్యాలీ చేశారు. లింక్ వర్కర్ స్కీమ్ ప్రోగ్రాం సూపర్వైజర్ డి.రమణ హెచ్ఐవి, ఎయిడ్స్, టిబి, సుఖ వ్యాధులు, 2017 యాక్ట్, 1097 హెల్ప్ లైన్ నెంబర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, లెక్చరర్ లింక్ వర్కర్ డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

15 నుండి డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం : ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ నందు ఉచిత కోర్సులు ట్రైనింగ్‌లో భాగంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ తరగతులు ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపల్ పి కిరణ్ కుమార్ తెలిపారు. ట్రైనింగ్ మూడు నెలలు ఉచితంగా ఇవ్వబడుతుందన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్స్ అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పరిశ్రమ సంబంధిత కంప్యూటర్ శిక్షణ ఉచితంగా లభిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9908799126, 9494791935 నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

వీధి కుక్కల దాడిలో లేగ దూడకు గాయాలు

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని కుమారపురంలో నీలాపు వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన లేగ దూడపై వీధి కుక్కలు దాడిచేసి తోక మొత్తం తినేసి దూడను తీవ్రంగా గాయపరిచాయి. కుక్కలు గతంలో ఒక దూడను గాయపరిచాయి. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వెంకటరెడ్డి ఆరోపించారు. గ్రామ సచివాలయంలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ ను నియమించాలని వెంకటరెడ్డి కోరారు.

తెరిపివ్వని వర్షాలు



వడ్డాదిలో కూలిపోయిన ప్రహరీలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలంలో వర్షాలు తెరిపివ్వటం లేదు. ప్రతి రోజూ ఏదో ఒక సమయంలో వర్షాలు కురుస్తునే ఉన్నాయి. బుధవారం కూడా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతమైన ఎండ కాయగా ఒంటి గంట తర్వాత ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏకధాటిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షాలు తెరిపి ఇవ్వకపోవడంతో నదుల్లో నీటి ప్రవాహం తగ్గడం లేదు. వర్షాలు వంతెన మరమ్మతు పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి.

కూలిన ప్రహరీలు

బుచ్చయ్యపేట : మండలంలోని వడ్డాదిలో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రెండు కుటుంబాలకు చెందిన ప్రహరీ గోడలు కూలిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానిక డాక్టర్ చంద్రశేఖర్ ఇంటి ప్రహరీ గోడ, పక్కనే ఉన్న సయ్యపురెడ్డి శ్రీను ప్రహరీగోడపై పడి కూలింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

యలమంచిలిలో భారీ వర్షం

యలమంచిలి : యలమంచిలిలో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2.30 నుంచి గంట పాటు ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురవడంతో జనజీవనం స్తంభించింది. పట్టణంలోని లోతట్టుప్రాంతాలు నీట మునిగాయి. ఏఎస్ఆర్ కోలనీ, రామనగర్, గాంధీనగరం, నెహ్రూనగర్ ప్రాంతాలు జలమయమయ్యాయి. మున్సిపల్ సిబ్బంది నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాల్లో నీటి తరలింపునకు చర్యలు చేపట్టారు.

వరి రైతులకు మేలు : వ్యవసాయాధికారి మోహనరావు

యలమంచిలి మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షం వరి రైతులకు ఎంతో మేలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి మోహనరావు ప్రజాశక్తికి చెప్పారు. వర్షాధార ప్రాంతాలైన పులపర్తి, కృష్ణాపురం, రేగుపాలెం గ్రామాల్లో ముమ్మరంగా దమ్ము పనులు జరుగుతున్నాయని, వారికి ఈ వర్షం వెన్ను దన్నుగా నిలిచి నూరు శాతం వరి నాట్లు పూర్తవుతాయని వివరించారు.

చినుకు రాలితే చిత్తడే

ప్రజాశక్తి-కోటవురట్ల : చినుకు రాలిందంటే చాలు చిత్తడి చిత్తడిగా దర్శనమిస్తుంది జల్లూరు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు. ఈ రోడ్డు అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో రహదారి అంతా బురదమయం అవుతుంది. దీంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. రాత్రి సమయంలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. రహదారి మధ్యలో పెద్ద కుంట పడడంతో వర్షపు నీరు అందులో నిలిచిపోతుంది. దీంతో వాహనదారులు అవస్థలు పడాల్సిన పరిస్థితి. అప్రోచ్ రోడ్డుకు వేసిన మట్టి అంతా వాహనాల ద్వారా వంతెన పైకి చేరుకుంటుంది. దీంతో వంతెనపై కూడా నీరు, బురద నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు, నాయకులు ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం. పలుచోట్ల వర్షాలకు అప్రోచ్ రోడ్డుకు వేసిన మట్టి నదిలోకి కొట్టుకుపోతుంది. సమస్యను పరిష్కరించేది ఎవరంటూ వాహనదారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



గోతుల్లో నీరు చేరి, బురదమయంగా ఉన్న జల్లూరు వంతెన అప్రోచ్ రోడ్డు



మాట్లాడుతున్న డాక్టర్ రామ్మోహన్‌రావు

పశు వైద్యశాలలో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం పశు వైద్యశాలలో ఏరియా పశు వైద్యశాల ఇన్‌ఛార్జి సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టినాయుడు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి. రామ్మోహన్‌రావు హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 రూపాయలకే లింగ నిర్ధారిత వీర్యం (ఆడ పెయ్యలు పుట్టే ఇంజెక్షన్) గురించి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉన్న పాడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కిసాన్ క్రెడిట్ లోన్స్ కొరకు దరఖాస్తులు ప్రతి గ్రామ పంచాయతీ నుంచి కనీసం 5 సేకరించాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందుకోసం మండలంలో 16250 డోసులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో గుళ్లేపల్లి, అంతకాపల్లి, ఆరిపాక పశు వైద్యాధికారులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ అరుణ, డాక్టర్ సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.



విలియం కేరీని సత్కరిస్తున్న నగేష్ తదితరులు

విలియం కేరీకి ఘన సత్కారం

ప్రజాశక్తి-పాయకరావుపేట : రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ దళిత నాయకులు పల్లా విలియం కేరీని బుధవారం జనసేన పార్టీ సీనియర్ నాయకులు తోట నగేష్ పట్టణంలోని పిఎసిఎస్ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దేవరపు రాజుబాబు, కూటమి నాయకులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, చించలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, బొంది కాశీ విశ్వనాథ్, ఆచంట దొర, నారపురెడ్డి పద్మ పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన..

పల్లా విలియం కేరీని పాయకరావుపేట మండల పాస్టర్స్ అసోసియేషన్ దైవజనులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దైవజనులు ఐజయ, ప్రేమ్ కుమార్, విజయకుమార్, అరుణ్ కుమార్, శ్రీనివాస్, నానీ, ఇస్సాకు, దయారత్నం, అనిల్, సాల్మన్ రాజు పాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-యలమంచిలి : 'శ్రీదర్శిని కళై కూడమ్' అనే మద్రాసు యూనివర్శిటీకి చెందిన సంస్థ నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్లో యలమంచిలి కొత్తపేట హైస్కూలు విద్యార్థులు ఆర్ట్ కాపిటేషన్‌లో పాల్గొని విశేష ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందని కొత్తపేట హైస్కూలు ప్రధానోపాధ్యాయులు యల్లపు రమణ పేర్కొన్నారు. బుధవారం హైస్కూలులో జరిగిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుందూరు రాజు, రాజేశ్వరి, అమరావతి, చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, రామలక్ష్మి పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

కొట్టుకుపోయిన రహదారి

బోడిగరువు, నేరళ్లపూడి గ్రామాలకు నిలిచిన రాకపోకలు



బోడగరువు, నేరళ్లపూడి రహదారికి గండిపడిన దృశ్యం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఇటీవల కురిసిన వర్షాలకు చింతలపూడి పంచాయతీ శివారు బోడిగరువు, నేరళ్లపూడి గ్రామాలకు వెళ్లే మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఈ రెండు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఈ రెండు గ్రామాలకు రూ.2కోట్ల వ్యయంతో మట్టిరోడ్డును కొత్తగా నిర్మించారు. వరద ఉధృతి ఉన్న కొన్ని చోట్ల కల్వర్టులు నిర్మించారు. మరికొన్ని చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరద ఉధృతికి బోడిగరువు సమీపంలో భారీ గండి పడింది. అనేక చోట్ల రోడ్డు కోతకు గురైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. బోడిగరువు పాఠశాలలో చదువుతున్న 31 మందిలో కొంత మంది బాల, బాలికలు ఇదే రోడ్డులో రావాలి. ఈ రెండు గ్రామాల గిరిజనులు వైద్య సదుపాయం కావాలన్నా, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోతే శారద నది దాటి రావడం తప్ప మరో మార్గం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి కొట్టుకపోయిన రోడ్డును వెంటనే పూడ్చాలని, కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని గ్రామానికి చెందిన పోయిరి ఎర్రయ్య, రాము తదితరులు అధికారులను కోరుతున్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్లు వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా నిలిచిపోయిన భారీ పైపులైనుకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. నాగేంద్రకాలనీ సమీపంలోని కొమ్మయ్యగుండం, నెహ్రూనగర్ ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటి సరఫరాచేసే పైపు లైను మూసుకుపోవడంతో యుద్ధప్రాతిపదికన కొత్తపైపులైను ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీర్ గణపతి సుబ్బారావు తెలిపారు. ఎర్రవరం సంపునుండి 1500 మీటర్లు కొత్త పైపు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే నాగేంద్రకాలనీ, నెహ్రూ నగర్ వాసులకు మంచినీటి ఇబ్బంది తీరుతుందని చెప్పారు. జలజీవన్ మిషన్‌తో సంప్రదించడంలో మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్ ప్రత్యేక శ్రద్ధ వహించారని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఒరిగిన విద్యుత్ స్తంభం
- భారీ వాహనాలకు తగిలే విధంగా వైర్లు



విద్యుత్ స్తంభం ఒరిగిపోయిన దృశ్యం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం జంక్షన్ నుండి రేఖవానిపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో గొల్లగరువు సమీపంలోని ఎస్ఎస్-17 బి-10 గల విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. దీంతో కొన్నాళ్లుగా విద్యుత్ వైర్లు రహదారి మధ్యలో భారీ వాహనాలకు తగిలే విధంగా ప్రమాదకరంగా ఉన్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్తు తీగలే ఆధారంగా స్తంభం ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారు. వర్షాల సమయంలో, భారీగా గాలులు వీచినా స్తంభం కూలిపోయే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఈ ప్రధాన మార్గం గుండా రైతులు పశువుల కొరకు ట్రాక్టర్ల ద్వారా గడ్డి తరలిస్తుంటారని, విద్యుత్ తీగలు భారీ వాహనాలకు తగిలే ప్రమాదం పొంచి ఉన్నదని, ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. మరి దీనిపై ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందిస్తారా.. లేదా? అనేది వేచి చూడాలి.

చిట్టడవిని తలపిస్తున్న క్రీడా మైదానం



పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్న క్రీడా మైదానం

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల సువిశాల క్రీడా ప్రాంగణం చిట్టడవిని తలపిస్తోంది. దీంతో క్రీడా ప్రాంగణంలోకి వెళ్లేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. పాఠశాల ఆవరణలోని క్రీడా ప్రాంగణం విశాలంగా ఉండడంతో హాకీ, క్రికెట్ కోర్టుల్లో పిచ్చి తుప్పలు మొలిచి పెరిగిపోవడంతో విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆడుకునే బాల్ తుప్పల్లోకి వెళితే తెచ్చుకోవాలంటే ఈ తుప్పల్లో విష సర్పాలు సంచరిస్తూ దర్శనమిస్తూ ఉండడంతో భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో నిర్మించిన ఖోఖో, కబడ్డీ కోర్టులు సైతం తుప్పలతో నిండిపోయి ఉన్నాయి. ఉదయం సమయంలో జాగింగ్ చేసే వాకర్స్ అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు క్రీడ మైదానాన్ని అభివృద్ధి చేయాలని విద్యార్థులు, వాకర్స్, క్రీడాభిమానులు కోరుకుంటున్నారు.



బ్రహ్మ కుమారీస్ శృతిని సత్కరిస్తున్న ముత్తంశెట్టి

ధ్యానంతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-కోటవురట్ల : ధ్యానం మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తుందని అవంతి కళాశాల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఉరకల పరుగుల జీవితంలో మానసిక ఒత్తిడికి లోనవకుండా నిత్యం ధ్యానం చేయాలని సూచించారు. బుధవారం కళాశాల వద్ద ధ్యానంపై సిబ్బందికి బ్రహ్మకుమారీస్ సిస్టర్ శృతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ పందిరి రాట మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెంలో సతకం పట్టు వద్ద కొలువైన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం దుర్గ దేవి శరన్నవరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు బోగపురపు వెంకటరమణ ఆధ్వర్యంలో పందిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. పి వెంకట అప్పారావు, కోరుబిల్లి గంగాధర్ దంపతులు, ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరాహ సూకరాజు, డైరెక్టర్లు, గౌరీ పరమేశ్వరి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఖనిజ లవణ మిశ్రమాన్ని అందిస్తున్న అధికారులు

పశువులకు గర్భకోశ పరీక్షలు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని సోమవరం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో రాష్ట్రీయ గోకుల మిషన్ నిధులతో పశువులకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.సౌజన్య మాట్లాడుతూ పిండ మార్పిడి పద్ధతి గురించి, లింగ వీర్య నిర్ధారిత ద్వారా ఆడపెయ్యల పుట్టించడం గురించి వివరించారు. శిబిరంలో 64 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఖనిజ లవణ మిశ్రమాన్ని, ఇతర మందులను ఉచితంగా అందించారు. 43 పెయ్యలకు నట్టల నివారణా మందు పంపిణీ చేశారు. కార్యక్రమం స్థానిక పశు వైద్య అధికారి ఆల్ఫాన్స్ జార్జ్, గర్భకోస చికిత్స నిపుణులు డాక్టర్ పి.హారిప్రియ, కసింకోట పశువైద్యాధికారి చైతన్యమణి, సిబ్బంది, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-రాంబిల్లి : రాంబిల్లి మండలం మామిడివాడ గ్రామంలో ఆత్మ వారి ఆధ్వర్యంలో జీవన ఎరువులు, నానో ఎరువులు, యూరియా, డిఏపీ వంటి ఎరువుల వాడకంపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సకాలంలో ఎరువులను ఏ విధంగా, ఎంత మోతాదులో వినియోగించాలో బీసిటి శాస్త్రవేత్త వన ప్రసాదరావు తెలిపారు. జీవన ఎరువులను చివికిన పశువుల ఎరువులో కలుపుకొని వినియోగిస్తే యూరియా వాడకం తగ్గించవచ్చని, భూసారం పెరుగుతుందని జిల్లా వనరుల కేంద్రం అధికారిణ పి.విజేత చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి సి.సుమంత, ఎంపిఇఒ రమారావు, రైతులు పాల్గొన్నారు.



ఎరువులు వాడకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

క్వారీ అనుమతులు రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:క్వారీ అనుమతులను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయం వద్ద క్వారీ బాధిత దళిత రైతులు చేపడుతున్న 50వ రోజు నిరసన దీక్షా శిబిరాన్ని కోటేశ్వరరావు సందర్శించారు. దీక్షకు సంఘీభావం తెలియజేశారు. ఆర్డీవో కార్యాలయం ముందు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, నల్లరాయి క్వారీతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దళిత రైతులు 50 రోజుల నుండి నిరసన దీక్షలు చేపడుతున్నప్పటికీ ఆర్డీవో, మైనింగ్ అధికారుల్లో చలనం లేదన్నారు. రైతుల సమస్యలపై స్పందించకపోవడం దుర్మార్గం అన్నారు. రైతు ప్రభుత్వం. రైతులకు అండగా ఉంటాం అంటున్న కూటమీ ప్రభుత్వానికి రైతులంటే ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. వ్యవసాయమే జీవనాధారంగా సాగు చేసుకుంటున్న దళిత రైతుల భూముల్లో క్వారీ తవ్వకాల కారణంగా జీడి మామిడి పంటలు, భూములు నాశనం అవుతున్నాయని తెలిపారు. సభాపతి అయ్యన్నపాత్రుడు దళిత రైతుల సమస్యపై స్పందించకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి రైతుల సమస్యను పరిష్కారం చేసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ఇప్పటికైనా రైతుల పట్ల సానుకూలంగా స్పందించకపోతే రైతు కుట్ర ప్రభుత్వంగా గుర్తిస్తామన్నారు. ప్రజా సంఘాల ద్వారా పోరాటాన్ని ఉధతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు, బొట్టా నాగరాజు రైతులు అప్పారావు, లావరాజు, పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కోటేశ్వరరావు, దళిత రైతులు

టిడిపి మండల అధ్యక్షునిగా అప్పలనాయుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: తెలుగుదేశం పార్టీ మండలం అధ్యక్షుడిగా జెడ్పీటిసి సుకల రమణమ్మ భర్త అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయ్యన్న శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, స్పీకర్ అయ్యన్న పాత్రుడు తనపై ఉంచిన నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షుడుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మసాగరం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్పలనాయుడుకు శుభాకాంక్షలు తెలియజేశారు.



అభినందిస్తున్న అయ్యన్న

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కే.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) నర్సీపట్నంలో ఈ నెల 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి డి.శివ మాట్లాడుతూ, సుమారు 7 సంవత్సరాలుగా సంక్షేమ బోర్డులో కార్మికులకు అందాల్సిన పథకాలను అమలు చేయలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ మెమోను జారీ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అందిస్తామని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, కార్మికులను మోసగిస్తుందని విమర్శించారు. కోట్లాది రూపాయలు సంక్షేమ బోర్డులో ఉంటున్నా ప్రభుత్వ అవసరాలకు ఉపయోగిస్తుంది తప్ప సంక్షేమ బోర్డులో సభ్యులుగా ఉన్న కార్మికులకి ఎటువంటి సహాయం అందించలేదన్నారు. ఈ ఏడేళ్ల కాలంలో అనేకమంది కార్మికుల్లో ప్రమాదాలకు గురై వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు.కార్మికులు పోరాడితే తప్ప సంక్షేమ బోర్డుని కాపాడుకోలేని పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఈనెల 15న తలపెట్టిన చలో విజయవాడ బోర్డు కార్యక్రమాన్ని కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న రామకృష్ణ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రాజయ్యపేటలో అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సచివాలయాన్ని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తడి పొడి చెత్త సేకరణ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటా తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి సత్యం కు ఆదేశించారు.



మాట్లాడుతున్న వెంకటరమణ

యూరియాపై అసత్య ప్రచారాలు తగవు

-మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వెంకటరమణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రైతులపై రాజకీయాలు చేయొద్దని మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే గణేష్ నియోజకవర్గంలో యూరియా దొరక లేదంటూ అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. నర్సీపట్నం నియోజకవర్గంలో యూరియా కొరత లేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వ కాలంలో రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి వారికి డబ్బులు చెల్లించలేదని గుర్తు చేశారు.

నర్సీపట్నం టౌన్ :. రైతుల గురించి మాట్లాడే అర్హత వైసిపి పార్టీ నాయకులకు లేదని 24వ వార్డు కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో రైతుల వద్ద విత్తనాల కోసం ముందుగానే డబ్బులు వసూలు చేసేవారని ఆరోపించారు. నియోజకవర్గంలో యూరియా లభ్యతపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు లెక్కలతో వివరించారని తెలిపారు.

నాతవరం: రైతుల గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యేకు లేదని టిడిపి సీనియర్ నేత కె అప్పలనాయుడు అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తాండవ నది లీకేజీ అరికట్టడానికి కనీసం నిధులు కూడా ఇవ్వలేని ఎమ్మెల్యే రైతుల కోసం మాట్లాడటం చాలా హాస్యస్పదంగా ఉందని విమర్శించారు.

అందరి పత్రిక ప్రజాశక్తి

ప్రజాశక్తి -నర్సీపట్నం: ప్రజాశక్తి అన్ని వర్గాల పత్రిక అని, ప్రజా సమస్యలను ప్రచురిస్తూ కార్మికుల కర్షకుల, ఉద్యోగుల పత్రిక అని తహసిల్దార్ రామారావు కొనియాడారు. బుధవారం కార్యాలయంలో ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ సంచికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల నిరంతరం వెలుగెత్తి చాటే పత్రిక అని అన్నారు. పత్రిక మరింతగా దినదిన అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో డిటి వై గణేష్, సీనియర్ అసిస్టెంట్ నారాయణరావు, ఆర్ఐ ఆర్ నాయుడు, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

కోటవురట్ల:ప్రజాశక్తి లో ప్రతి అక్షరం విలువైనదేనని తహసిల్దార్ తిరుమల బాబు కొనియాడారు. 45వ వార్షికోత్సవ సంచికను బుధవారం కార్యాలయంలో సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాశక్తి అన్ని వర్గాలను ఆకర్షించుకుంటూ విలువలతో కూడిన వార్తలను ప్రచురించడంతోపాటు అన్ని వర్గాల ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల, నాయకుల దృష్టికి తీసుకు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మణికంఠ, మండల సర్వేయర్ చిన్ని బాబు, జూనియర్ అసిస్టెంట్ సత్తిబాబు పాల్గొన్నారు.





ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న తహశీల్దార్లు తిరుమలబాబు, రామారావు



మాట్లాడుతున్న డిఎస్పి

టెక్నాలజీని వినియోగించుకోవాలి

-డిఎస్పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: సాంకేతికతను వినియోగించుకోవాలని డిఎస్పి శ్రీనివాసరావు సూచించారు. నర్సీపట్నం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా పోలీస్ సాంకేతిక నిపుణుల బృందం, అనకాపల్లి కలెక్టర్ కార్యాలయ ప్రతినిధులు నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించగా రూరల్ సీఐ రేవతమ్మ పాల్గొన్నారు. పట్టణ, గ్రామ పోలీసు సిబ్బందికి ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటాబేస్ (ఐఆర్ఎడి) ప్రాధాన్యం, అవసరంపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, నివారణలో శాస్త్రీయమైన సమాచారం సేకరణ కీలకమని డీఎస్పీ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసిన ఐఆర్ఎడి వ్యవస్థ ద్వారా ప్రమాదం వివరాలు డిజిటల్ రూపంలో నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రమాదం ఎక్కడ జరిగింది? బాధితుల పరిస్థితి ఎలా ఉంది? వంటి అంశాలు రికార్డు చేయబతాయని వివరించారు. ప్రాణ నష్టం తగ్గించేందుకు టెక్నాలజీ వినియోగం తప్పనిసరి అని తెలిపారు.ప్రాణాలను కాపాడటం, కుటుంబాల ఇబ్బందులను తగ్గించడం, పరిహార ప్రక్రియను వేగవంతం చేయడం ఈ పథకం ఝఖ్య ఉద్దేశమని తెలియజేశారు.

పాఠశాలలో నిరుపయోగంగా కంప్యూటర్లు



నిరుపయోగంగా ఉన్న కంప్యూటర్లు

ప్రజాశక్తి -చీడికాడ:ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు కూడా సాంకేతిక పరంగా విద్యలో అభివృద్ధి చెందాలని కేంద్ర ప్రభుత్వం సర్వ శిక్ష అభియాన్ (ఎస్ ఎస్ సి ఎ) పథకం ద్వారా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లు పంపిణీ చేయడం జరిగింది. చీడికాడ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో నాలుగు నెలలు గడుస్తున్నా పాఠశాలలో కంప్యూటర్లు స్టోర్ రూమ్ లో నిరుపయోగంగా ఉన్నాయి.

ఈ విషయంపై ప్రధానోపాధ్యాయులు గోవిందనీ వివరణ అడగ్గా... ఈ కంప్యూటర్లు పాఠశాల గదిలో అమర్చమని తమకు ప్రభుత్వం నుండి ఎలాంటి సూచనలు రాలేదని తెలిపారు.

ఈ విషయంపై అవుట్సోర్సింగ్ ద్వారా నియమితులైన ఐటీ బోధకుడు నేతాజీని వివరణ అడగ్గా కంప్యూటర్ విద్య బోధించమని తనని నియమించారని, ఇప్పటివరకు కంప్యూటర్లు గదిలో ఇన్స్టిలేషన్ చేయలేదని పై అధికారులని అడిగితే తననే అమర్చుకుని, బిల్లులు పెట్టుకోమని చెబుతున్నారన్నారు.అది తనకు సాధ్యం కాదని అంత పెట్టుబడులు తాను పెట్టలేనని మరల అధికారులకు తెలియజేస్తానన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కంప్యూటర్లు పాఠశాలలో అమర్చాలని పలువురు కోరారు.



అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి

మత్తు పదార్థాల అనర్థాలపై ర్యాలీ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక బాల యోగి గురుకులం వద్ద బుధవారం మత్తు పదార్థాలు అనర్థాలపై డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి - ఆరోగ్యాన్ని కాపాడుకోండి పొగాకు వాడకం ప్రాణాలకు ముప్పు అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే మత్తు పదార్థాలు, పొగాకు వినియోగం వంటి వాటి నుంచి దూరంగా ఉంచాలని సూచించారు.మత్తు పదార్థాల వాడకంతో యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని తెలిపారు. యువత టుబాకో వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతూ ఆనందభరిత జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. రూరల్ సీఐ రేవతమ్మ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమామహేశ్వరరావు, పోలీసులు పాల్గొన్నారు. .



రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి

దాతల సహకారంతో గ్రంథాలయ అభివృద్ధి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాకలో గ్రామీణ గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు బుధవారం సందర్శించారు. గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. దాతల సహకారంతో గ్రంథాలయ అభివృద్ధి పనులు చేపట్టాలని, గ్రామ సచివాలయాల నుండి రావలసిన గ్రంథాలయ పన్ను సకాలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నిధులకు జమ అయ్యేటట్టు చూడాలన్నారు. రీడర్స్ సంఖ్య పెంచాలని, పాఠకులకు అవసరమైన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ అధికారి జనార్ధన్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి గ్రంథాలయాధికారి వి ఆనంద్ పాల్గొన్నారు.



బురదమయంగా ఉన్న రోడ్డు

అస్తవ్యస్తంగా రోడ్డు

ప్రజాశక్తి-నాతవరం: మండలం నాతవరం నుంచి తాండవ వరకు 7 కిలోమీటర్ల మేర మార్గం అధ్వానంగా తయారైంది, వర్షం పడితే ప్రయాణికులు ఎంతో అగచాట్లు పడుతున్నారు. దానికితోడు రోడ్డు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాల మీద ప్రయాణం చేయాలంటే గంటల తరబడి సమయం వెచ్చించాల్సి ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. అనారోగ్య కారణంగా ప్రయాణించాలన్న చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు అంటున్నారు. కనీసం ఆ గుంతలు మూసిన బాగుండు నని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ విషయంపై నాయకులు, అధికారులు స్పందిస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి





అనకాపల్లి, నక్కపల్లిలో ఆందోళన చేపడుతున్న ఆటో కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ పెద్ద ఎత్తున కార్మికులు కదం తొక్కారు. సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటో కార్మికులను ప్రభుత్వ ఆదుకోవాలని, పెంచిన పెనాల్టీలు ఇన్సూరెన్స్, ఇతర చార్జీలలో తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు, రుత్తల శంకర్రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో నిరుద్యోగులుగా ఉన్న యువత అప్పులు చేసి ఫైనాన్స్ ద్వారా ఆటోలు కొనుక్కొని స్వయం ఉపాధి పొందుతూ కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారికి ఎటువంటి ఆర్థిక సహకారం అందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జి.సత్యనారాయణ, జి దేముడు నాయుడు, సూరిశెట్టి బాపు నాయుడు, గణపతి, శంకర్, ఎస్‌కె సుభాని, శ్రీనివాసరావు, కాళీ, రమణ, బాపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: స్త్రీ శక్తి ఉచిత పథకంతో తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శ్రీ వీర వేంకట రాజేశ్వరి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఆందోళన చేపట్టారు. బుధవారం నక్కపల్లి జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టి, తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. వీరికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసీపీ నేత వీసం రామకృష్ణ మద్దతు తెలిపారు. తహసిల్దార్ నరసింహామూర్తికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు, ఆటో కార్మికులు మాట్లాడుతూ, ఉచిత బస్సు పథకంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 లక్షల మంది ఉపాధి కోల్పోవడం జరిగిందని, ఆటో కార్మికులతో పాటు ఆటో మొబైల్ రంగంలో పని చేసే కార్మికులు, మెకానిక్ లు, సర్వీసింగ్ చేసే కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతమైన చదువులు చదువుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక లక్షల రూపాయలు అప్పులు చేసి ఆటోలు నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఉచిత బస్సులతో ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని ఆవేదన వెలిబుచ్చారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వీసం నానాజీ, యూనియన్ అధ్యక్షులు శీరం నూకరాజు, రాజు, దుర్గారావు, తాత బాబు, కృష్ణ, నాయుడు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్: మహిళలకు ఉచిత బస్సుపై ప్రభుత్వం పున్ణ పరిశీలన చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆటో డ్రైవర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు.జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నుండి ర్యాలీ చేపటారు. అనంతరం జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ రెహమాన్,జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. కాసుబాబు మాట్లాడుతూ, ఉచిత బస్సులు పెట్టడంతో ఆటో మోటార్ కార్మికుల ఆదాయం 80 శాతం వరకు తగ్గిపోయిందన్నారు. దీంతో దీనస్థితిలో ఆటో మోటార్ కార్మికులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, నాగేశ్వరరావు, రాంబాబు, బుజ్జిబాబు, అప్పలరాజు, అన్నాజీ, కె.రాజకుమార్, శివాజీ పాల్గొన్నారు.

నేడు పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-చీడికాడ: బైలపూడి గ్రామంలో ఈనెల 11న గురువారం ఉదయం 9 గంటలకు స్థానిక పాల కేంద్రం వద్ద పశువులకు ఉచిత గర్భ కోశ నివారణ చికిత్స వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారిని కెవిఎస్ రాఘవమ్మ తెలిపారు. విశాఖపట్నం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు

12 వారాల వేతన బకాయిలు చెల్లించాలి

గ్రామ సచివాలయం వద్ద ఉపాధి హామీ కూలీల ధర్నా

ప్రజాశక్తి-మునగపాక : ఉపాధి హామీ కార్మికులకు 12 వారాల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని వెంకటాపురం గ్రామ సచివాలయం వద్ద ఉపాధి హామీ కూలీలు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి బాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు కార్మికులు 12 వారాల నుండి కూలి డబ్బులు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు అర్థాకలితో కాలం వెల్లదీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశా. రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి హామీ కార్మికులను వేధింపులకు గురి చేసే విధానం మానుకొని, కూలీల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని హితవు పలికారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వ జీవో ప్రకారం కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.309 చెల్లించాలని, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని, పని ముట్లు అలవెన్స్, వేసవి అలవెన్స్ చెల్లించాలని, రోజుకు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిన్ని వెంకటలక్ష్మి, కడియం పద్మ, చిన్ని సత్యవతి, బలిరెడ్డి శ్రీనివాసరావు, అప్పారావు, రామారావు, అమ్మాజీ, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపురం సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

శ్రీప్రకాష్‌లో ఓనం సంబరాలు


ప్రజాశక్తి-పాయకరావుపేట : పట్టణంలోని శ్రీప్రకాష్ జూనియర్ కాలేజీలో బుధవారం ఓనం సంబరాలు ఘనంగా జరిగాయి. జూనియర్ కళాశాల విద్యార్థినులు కేరళ సంప్రదాయ దుస్తులు ధరించి పూజలు చేశారు. కేరళలో ప్రాచుర్యం పొందిన పాటలు, నృత్యం అద్భుతంగా ప్రదర్శించారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు వివిధ రాష్ట్రాల సంసకృతుల పట్ల అవగాహన ఏర్పడి మన దేశ భిన్నత్వంలో ఏకత్వానికి దోహదపడుతుందని ప్రిన్సిపాల్ భానుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మిస్ట్రెస్‌లు, అధ్యాపకులు, అకాడమిక్ ఇంఛార్జి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



ఓనం సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల : సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపీడీవో చంద్రశేఖర్‌కు సచివాలయం సిబ్బంది వినతి పత్రాన్ని అందజేశారు. ఇంటింటికి తిరిగి సర్వేలు, సమయపాలన లేకుండా ఒత్తిడితో కూడిన విధులకు విముక్తి కలిగించాలని, రికార్డు అసిస్టెంట్ క్యాడర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్చాలని, ఇంక్రిమెంట్లు సకాలంలో అందజేయాలని కోరారు. పలు గ్రామాలకు చెందిన సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపిడిఒ చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు